ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**


తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 02 సంచిక -348 | పేజీలు - 8 | వెల - 03/- | ఆదివారం 5 ఏప్రిల్ 2026

# 'రాజధాని' మరింత వేగం



- చకచకా పనులు సాగి తీరాల్సిందే
- -అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం
- అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే
- -నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు





**అమరావతి, ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి **మిగతా 2లో...**

# ప్రళయానికి 48 గంటలే

- ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది: ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం
- హర్మూజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- 48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు
- అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు



**ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.

ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం**మిగతా 2లో...**

# అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

- సకాలంలో పూర్తి చేయకపోతే ఆలోచిస్తాం
- బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు



**అమరావతి ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ఆంధప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి రాజధాని అంశంపై మరోసారి చర్చనీయాంశంగా మారేలా వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై తీర్మానం చేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, అసలు నిర్మాణం పూర్తి కావడం ద్వారానే రాజధాని స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదు. అది మాకు శాసన రాజధాని మాత్రమే. అలాంటప్పుడు మేమెందుకు రూ.లక్షా పదివేల కోట్లు ఖర్చు చేస్తాం? అమరావతి **మిగతా 2లో...**

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



2లో.

# కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

- : మంత్రి నారా లోకేశ్
- విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస
- కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్



2లో.

# రాయలసీమలో హార్టికల్చర్ హబ్

- ఆదాయ వనరుల పెంపుపై ప్రభుత్వ దృష్టి
- శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

8లో.




# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

- రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం
- తీవ్రంగా ఖండించిన హరీష్ రావు





2లో.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

- బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే
- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :**బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.**మిగతా 2లో...**

# 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

- ఏదైనా ఐడీ కార్డుతో 5 కేజీల ఎల్పీజీ సిలిండర్
- అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదని స్పష్టం చేసిన కేంద్రం
- దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కొరత లేదు




2లో.

# 'రాజధాని' మరింత వేగం

**మొదటిపేజీ తరువాయి**

రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷-గ్గ÷ట్లు నిర్దేశిరచుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్టక్చ్రర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాస్టక్చ్రర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరించి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

**సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు**

**కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**



**తిరువనంతపురం ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

**మొదటిపేజీ తరువాయి**


పనులు వేగంగా పూర్తి చేయాలి. సీఎం చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తాం అని బొత్స అన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, అమరావతి అంశం చుట్టూనే ప్రభుత్వం, మీడియా తిరుగుతోందని బొత్స విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి ఒకే అంశంపై దృష్టి సారించడం దురదృష్టకరమని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మామిడి పండ్లలో కూడా కల్తీ జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణం విషయానికి వస్తే, గతంలో టీడీపీ ప్రభుత్వంలో కేవలం 5 శాతం పనులే పూర్తయ్యాయని బొత్స పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు అమరావతిపై ఎంత ఖర్చు చేశారు, ఎంత ఫిజికల్‌గా పనులు జరిగాయి, ఎంత మొత్తాన్ని అడ్వాన్స్‌లుగా ఇచ్చారు అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ వ్యయం మొదట లక్ష 16 వేల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు అది రెండు లక్షల కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. నిర్మాణ వ్యయాల్లో భారీ పెరుగుదలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలను పూర్తి చేసి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, పార్లమెంట్‌లో అమరావతిపై చూపిన శ్రద్ధను ప్రత్యేక హోదా సాధనపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు బొత్స. ప్రత్యేక హోదా వస్తే ముంబై స్థాయి నగరాలు, అనేక అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఏర్పడే అవకాశముందని అన్నారు. అమరావతిని ఆపేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసిన బొత్స, ప్రభుత్వం ముందుగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరువాతే ప్రకటనలు చేయాలని సూచించారు. కేవలం పేర్లు పెట్టడం లేదా ప్రకటనలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని విమర్శించారు. మొత్తంగా అమరావతి అంశంలో రాజకీయ విమర్శలు ముదురుతున్న నేపథ్యంలో, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసే అవకాశముంది.

# ఆ ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిందే!

**తెలుగుగంగ, వీఎంసీ ఉద్యోగుల పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

**2 నెలల్లో రెగ్యులరైజ్ చేయాలన్న ధర్మాసనం**

**కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి ఊరట**




**అమరావతి, ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో దశాబ్దాల తరబడి తక్కువ జీతంతో పనిచేయించుకుని క్రమబద్ధీకరణ నిరాకరించడం శ్రమ దోపిడీకి పాల్పడటమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. "రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా తాత్కాలిక, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకోవడాన్ని అనేక సందర్భాల్లో మేం గమనిస్తున్నాం. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వీరితో పూర్తికాలం పనిచేయించుకుంటూ రోజువారీ వేతన జీవులుగా ఉంచడం అన్యాయం. తమ సేవలను క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగులు కోరినప్పుడల్లా అధికారులు సాకులు చెబుతున్నారు. ఈ వైఖరి సరికాదు. వారి వినతిని పరిశీలించేటప్పుడు ప్రభుత్వం ఆదర్శ యజమానిగా వ్యవహరించాలి. తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్, టైపిస్టు తదితర కేడర్లలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న పిటిషనర్లు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ)లో టైపిస్టులు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు సబార్డినేట్లు, ట్రేసర్లు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు తదితర సర్వీసులను 2నెలల్లో క్రమబద్ధీకరించాలి." అని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషనర్ల సర్వీసును క్రమబద్ధీకరించడానికి నిరాకరిస్తూ ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దుచేసింది. తీర్పుకాపీ అందిన నాటి నుంచి రెండు నెలల్లో పిటిషనర్ల సేవలను క్రమబద్ధీకరించాలని, వారికి అన్ని అనుబంధ ప్రయోజనాలను అందించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేందుసామంతతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

# ప్రళయానికి 48 గంటలే

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల వల్ల హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి."ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

**మొదటిపేజీ తరువాయి**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

**రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం**

**తీవ్రంగా ఖండించిన హరీష్ రావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటాం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటామని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

# కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి**





కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.కర్ణాటకలోని సింధనూరు హోసల్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు.కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

# శాంతిపురం ఐటీ విభాగం మండల అధ్యక్షుడిగా యువరాజు నియామకం

**శాంతిపురం (రిపబ్లిక్ న్యూస్ ) ఏప్రిల్ 4**

కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండల ఐటీ విభాగం అధ్యక్షుడిగా కెనమకూలపల్లి గ్రామానికి చెందిన యన్. యువరాజును నియమించినట్లు చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితేడ వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి అనుబంధ కమిటీల నియామకం చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా వైసిపి ఐటి విభాగం శాంతిపురం మండల అధ్యక్షులుగా కెనమకూలపల్లి పంచాయతీ, కెనమకూలపల్లి గ్రామానికి చెందిన యన్. యువరాజును నియమిస్తూ అధికారికంగా ప్రకటించారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా సోషల్ మీడియా, ఐటీ కార్యకలాపాలను గ్రామ స్థాయి నుంచి మరింత విస్తరించేందుకు యువరాజు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా యువరాజు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ నియామకంతో యువరాజుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాంతిపురం మండల ఎంపీపీ కోదండ రెడ్డి, శాంతిపురం మండలం కన్వీనర్ బుల్లెట్ దండపాణి, కుప్పం నియోజకవర్గం బూత్ ఇంచార్జ్ విజయ్ కుమార్ పాల్గొన్నారు

# దళితుల పై అగ్రవర్ణాల గూండాల దాడి


**కుప్పం నియోజవర్గం(రిపబ్లిక్ న్యూస్)ఏప్రిల్ 4**

చిత్తూరు జిల్లా,శాంతిపురం మండలం,నంజంపేట గ్రామం లో చిన్నపిల్లలు గొడవలు వలన, అదే ఆసరాగా తీసుకున్న అగ్రకుల గుండాలు అదే గ్రామానికి చెందిన లి ఉమాశంకర్, గిరిప్రసాద్ , బాలాజీ ఆచారి, ప్రకాష్ నాయుడు, సూరప్ప నాయుడు, శ్రీ రామ్, ప్రవీణ్, యశ్వంత్ ఇంకా వారి కుటుంబానికి చెందిన దాదాపు 50 మందితో అందరూ కలిసి అర్ధరాత్రి సుమారు11,గంటలు సమయంలోనిద్రిస్తున్న సమయంలో దళితుడు అయిన మునెప్ప ఇంటి మీద మూకుమ్మడిగా దాడిచేసి ఆడవారు, బాలింతలు అనే కనికరం లేకుండా విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ విషయంగా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు.

# బత్తలాపురంలో బోయకొండ గంగమ్మకు మండల పూజ




**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 04 రిపబ్లిక్ న్యూస్** మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంలో నూతనంగా నిర్మితమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో మండల పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామస్తులచే 42 రోజుల క్రితం ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో మండల పూజను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఉదయాన్నే చుట్టుపక్కల ఉన్నటువంటి భక్తులందరూ ఆలయం వద్దకు చేరుకొని బోయకొండ గంగమ్మకు విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

### బేతంచెర్ల మండల పాస్టర్స్ అసోసియేషన్ వారు

# రన్ ఫర్ జీసస్ ర్యాలీ




**బేతంచెర్ల ప్రతినిధి, ఏప్రిల్ 4, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** బేతంచర్ల పట్నంలోని క్రైస్తవులు ఈస్టర్ పండుగను పురస్కరించుకొని రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు దాసన్న, కార్యదర్శి పాస్టర్ డివిఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. యేసుక్రీస్తు మరణ పునరుద్ధానాల గురించి వివరిస్తూ పట్టణములోని పురవీధుల గుండా ర్యాలీని కొనసాగించారు. అధ్యక్షులు దాసన్న మాట్లాడుతూ మనుషుల పాపములను తీసివేయుటకు యేసు క్రీస్తు శిలువపై మరణించి మూడవ రోజున తిరిగిలేచిన రోజును ఈస్టర్ పండుగగా జరుపుకుంటాము అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సామేలు, జాయింట్ సెక్రెటరీ శేఖర్ , మల్లేష్ బాబు, ప్రభుదాసు, మార్కు, సురేష్, మేకల నాగరాజు, రూబెన్, తిమోతి మరియు క్రైస్తవ ప్రజలు పాల్గొన్నారు

# వివాహాల కు హాజరైన మాజీ మంత్రి బుగ్గన




**బేతంచర్ల ప్రతినిధి, ఏప్రిల్ 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన గుద్దేటి నాగేశ్వరరెడ్డి కుమార్తె ,లక్ష్మీ హరిత & చైతన్య,వీరి వివాహం సోమయాజుల పల్లె దగ్గర ఉన్న సాయిబాబా గుడి ఫంక్షన్ హాల్ లో జరిగినది అలాగే బేతంచెర్ల మండల పరిధిలోని తవిసి కొండ గ్రామానికి చెందిన "కీ "శే " నేగటూరు డీలర్ నాగేశ్వరరెడ్డి భార్య సులోచన దేవి కుమారుడు వెంగళ్ రెడ్డి& లక్ష్మీ ప్రసన్న,వీరి వివాహం బేతంచెర్ల పట్టణంలోని టీ.టీ.డీ. కళ్యాణ మండపం లో జరిగినది. ఈ వివాహాలకు హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై నూతన దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రి బుగ్గనతో పాటు నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, కౌన్సిలర్ చింతా నాగిరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ రుద్రవరం నారాయణ,వైసిపి నాయకులు తవిసి కొండ పాపసాని తిరుమలేశ్వర రెడ్డి, తదితరులు వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు

# జీరామ్జీ చట్టాన్ని రద్దుచేయాలి

## ఈనెల10 నుండి 12 వరకు జరుగు పాదయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయండి

**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**





కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి చట్టంను రద్దుచేసి జీరామ్జీ చట్టాని తేవడం దుర్మార్గమని వెంటనే జీరామ్జీ చట్టంను రద్దుచేయాలని ఏపీ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్యలు డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్ ఈనెల 10 నుండి 12 వరకు అనంతపురం నుండి బండపల్లి వరకు జరుగు ఏపీ వ్యవసాయ కార్మికసంఘం, సీపీఐ ఆధ్వర్యంలో జరుగు పాదయాత్ర, బహిరంగ సభన. । గోడపత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో గతంలో కేంద్రప్రభుత్వం 90శాతం నిధులు ఇచ్చేదని రాష్ట్రప్రభుత్వం 10శాతం వాటా ఇచ్చేదన్నారు, ఈనూతన చట్టం వలన రాష్ట్రప్రభుత్వం తన వాటాగా 40శాతం ఇవ్వాలని నిర్ణయించడం వలన చాలా రాష్ట్రాలు చేతులు ఎత్తేసే పరిస్థితి ఉందన్నారు. గ్రామీణ ఉపాధి చట్టం వలన గ్రామాల్లో వలసలు తగ్గి పేదల ఆర్థిక పరిస్థితి కొంత మెరుగైందన్నారు. అయితే నేడు కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ చట్టంను మార్పులు చేస్తూ పేదలు కడుపు కొడుతూ, కార్పొరేట్కు ఊడిగం చేసే పద్ధతుల్లో పాలన సాగుతుందన్నారు. 12 సం మోడీ పాలనలో రైతాంగానికి చేసింది ఏమి లేదన్నారు. కేంద్రప్రభుత్వం తక్షణమేఈ జీరామ్జీ చట్టాన్ని రద్దుచేసి గ్రామీణ ఉపాధిహామీ చట్టంను యధావిధిగా అమలు చేయాలని కోరారు. జాతీయ ఉపాధీ హామీ చట్ట దేశంలో మొట్టమొదట ప్రారంభించిన బండపల్లికి అనంతపురం నుండి పాదయాత్ర ద్వారా చేరుకుని అక్కడ బారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, జాతీయ నాయకులు నారాయణ, జాతీయ కార్యదర్శులు అనీరాజ, పల్లావెంకటరెడ్డి, హాజరవుతారన్నారు. 10వ తేది నుండి 12 వరకు జరుగు పాదయాత్రలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఐ రాష్ట్రకార్యదర్శి జీ ఈశ్వరయ్య, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయప్రదాన కార్యదర్శి గుల్జర్ సింగ్ గోరియా, జాతీయ కార్యదర్శి వీఎస్ నిర్మల్, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్సీ జల్లివిల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు జాఫర్లు పాల్గొంటారన్నారు. ఈ గోడపత్రికలు విడుదల చేసిన వారిలో ఏపీ వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నభిరసూల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాస్కర్యాదవ్, ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి ఎస్ మునెప్ప, సీపీఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి డీ శ్రీనివాసరావు, డిహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు రూరల్ మండల కార్యదర్శి జీ సురేంద్రయాదవ్, రామచంద్రుడు, ఆచారి తదితరులు ఉన్నారు

# ఈ కుల దురహంకారం

# ఈ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ

### బుగ్గన మధుసూదన్ రెడ్డి
### సామాజిక విశ్లేషకుడు

**బేతంచర్ల ప్రతినిధి, ఏప్రిల్ 04,(ప్రజా పబ్లిక్ న్యూస్)**




కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు,మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి వ్యాఖ్యలు కులపిచ్చికి ఓ ప్రబల నిదర్శనం, ఈ కుల విషపూరిత వ్యాఖ్యలను ప్రతి ఒక్క ప్రజాస్వామ్యవాది ఖడించాలి.ఓక విధంగా ఈ పెడ ధోరణి ఇలాగే కొనసాగిస్తే ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను తీవ్రంగా అవమానపరచినట్లే అనే మాట అక్షర సత్యం. ఈ ప్రజాస్వామ్యంలో ఏ ఒక్క నాయకురాలు పై నుంచి ఉడిపడలేదు,ప్రజలు ఓట్లు వేస్తేనే అందలం ఎక్కినవారే,దీనికి మరెవ్వరరూ అతీతులు కాదు.ఎందుకంటే ఓక రాజ్యసభ సభ్యురాలు వంటి ఓక గౌరవనీయమైన హోదాలో ఉన్న రేణుక చౌదరి గారి నోటి నుండి ' పెట్టారా పేరు అమరావతి పిలవరా కమ్మ రావతి ' అంటూ జాలువారిన వ్యాఖ్యలు వింటే సగటు ప్రజానీకానికి ఎవరికైనా కులపిచ్చి ముదురి పాకాన పడిందా అని అనిపించక మానదు.అదే మాదిరి కాలు జారితే వెనక్కి తీసుకోవొచ్చేమో గాని,అదే నోరు జారితే ఆ మాటలను వెనక్కు తీసుకోవడం అంతా ఆషామాషి వ్యవహారం కాదు కూడా. అదేమాదిరి రాజకీయ రంగంలో ఎవరైనా ఎంతటివారైనా కుల ప్రస్తావన తీసుకువస్తే మాత్రం అది ఖచ్చితంగా తప్పిదం క్రిందకు వస్తుంది తప్ప అది ఎప్పటికి ఒప్పు కాదు.ఓక విధంగా చెప్పాలంటే ఈ ప్రజాస్వామ్యంలో ఇలాంటి మాటలు మనం వినాల్సి రావడం అత్యంత బాధాకరమైన విషయం.అంతేకాదు ఇలాంటి పరుష వ్యాఖ్యలు రోజు రోజుకు రాజకీయ రంగంలో నైతిక విలువలు అడుగంటిపోతున్నాయి అనే దానికి ఓ ప్రబల నిదర్శనం కూడా.పైగా రాజకీయాలలో కాకలు తీరిన,మంచి ఏదో చెడు ఏదో బాగా ఎరిగిన నాయకురాలు,ఫైర్ బ్రాండ్ గా పేరుగాంచిన రేణుక చౌదరి వంటి కాంగ్రెస్ సీనియర్ నాయకురాలి నోటి నుంచి ఇలాంటి కులపైత్యం తలకెక్కే వ్యాఖ్యలు వెలువడటం ఎంతైనా కడు ఆక్షేపనీయం.దీనిని ఖచ్చితంగా ప్రతి యొక్క మానవతావాదులు,మానవహక్కుల సంఘాలవారు, జర్నలిస్ట్,సంఘాలవారు,మేధావి వర్గాలు,బాగా అనుభవం పండిన రాజకీయ నాయకులు తీవ్రంగా ఖండించి తీరాలి.అంతేకాదు నోరు మంచిది, అయితే ఊరు మంచిది అవుతుంది అని మన పెద్దలు ఊరకనే సెలవు ఇవ్వలేదు.ఎందుకంటే ఈ ప్రజాస్వామ్యంలో అర్థ,అంగ బలం పుష్కలంగా ఉన్న ఎంతటి నాయకులు అయిన ఇలాంటి బాధ్యతారాహిత్య మాటలు మాట్లాడితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అశేష ప్రజల నుంచి చాలా తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదుర్కొక తప్పదు,అగ్రవేశాలు సైతం చవిచూడక తప్పదు.

ఏదిఏమైన కూటమి సర్కారు వారు గాని లేక న్యాయకొవిధులు గాని ఇలాంటి,దుందుడుకు,అధికార దర్పం తలకెక్కి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు రేణుక చౌదరి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఆమెపై చట్టరీత్యా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిన గురుతర బాధ్యత వారి భుజస్కంధాలపై ఎంతైనా వుంది.ఎందుకంటే ఈ ప్రజాస్వామ్యంలోని ఇతర కులస్థుల ప్రజలను అవమానించేలా ఇలా దురుసు వ్యాఖ్యలు చేయడం ఖచ్చితంగా ఓక అతి పెద్ద తప్పిదం క్రిందకు వస్తుంది. చట్టం దృష్టిలో అందరూ సమానమే తప్పు ఎవరూ చేసిన తప్పు తప్పే. ఏమైనా ముందుందు రాజకీయ రంగంలో ఇలాంటి అపవిత్రమైన,హేయమైన,ఈ యావత్తు సమాజమే తలవంచుకునేలా వ్యాఖ్యలు మరెవ్వరూ చేయకుండా ఓక చట్టాన్ని తీసుకురావాల్సిన గురుతర బాధ్యత సుప్రీం కోర్ట్ వంటి అతి పెద్ద న్యాయస్థానాల పెద్దలపై ఎంతైనా వుంది.అలా చేయకపోతే భవిష్యత్ లో ఇలాంటి కులపిచ్చితో కూడిన వ్యాఖ్యలు మరింత మంది నాయకుల నుండి వినే ప్రమాదం మన దేశ ప్రజానీకానికి పొంచి వుంది.తస్మాత్ జాగ్రత్త

# కోడుమూరులో ఏపీ బడ్జెట్ 2026-27 అవుట్రీచ్ కార్యక్రమం

## ప్రజాహిత దృక్పథంతో బడ్జెట్ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 4)**
కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు మండల రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2026-27 అవుట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై మాట్లాడారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు, మహిళలు, యువత మరియు సామాన్య ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ ప్రజాహిత దృక్పథంతో ఉందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆనందదాయకమని పేర్కొన్నారు.
మొత్తం బడ్జెట్ 3.32 లక్షల కోట్లు కాగా, కోడుమూరు నియోజకవర్గానికి 362 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విభాగాల వారీగా పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధికి 120 కోట్లు, విద్యకు 36 కోట్లు, మహిళా & శిశు సంక్షేమానికి 22 కోట్లు, ఆరోగ్యానికి 19 కోట్లు, వ్యవసాయానికి 7 కోట్లు, ఉద్యానవనాలకు 5 కోట్లు కేటాయించారని వివరించారు.
అలాగే "సూపర్ సిక్స్" పథకాల కింద ఎన్టీఆర్ భరోసా కోసం 163 కోట్లు, తల్లికి వందనం కోసం 73 కోట్లు, అన్నదాత సుఖీభవకు 49 కోట్లు, దీపం 2.0కు 9 కోట్లు, స్త్రీ శక్తికి 5 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి 1 కోటి కేటాయించారని తెలిపారు.
మొత్తంగా అభివృద్ధి మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపొందించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు.

# కర్నూలులో జయరామ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

## మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభం

## - ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు సేవలందిస్తామన్న నిర్వాహకులు






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 4)**
కర్నూలు నగరంలోని ఠాగూర్ నగర్, డోన్ రహదారిలో నూతనంగా నిర్మించిన జయరామ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మాజీ మంత్రి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శిల్ప చక్రపాణి రెడ్డి, శిల్ప రవి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.
ప్రారంభోత్సవం అనంతరం టీజీ వెంకటేష్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కే చంద్రమౌళి రెడ్డితో కలిసి ఆసుపత్రిలోని ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు వైద్య రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్ర అభివృద్ధిలో ఈ ప్రాంతం పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనేక సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నదని ఆయన గుర్తుచేశారు. అలాంటి ప్రాంతంలో అత్యాధునిక సదుపాయాలతో జయరామ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం కావడం అభినందనీయమన్నారు.ప్రజలు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా మొదటగా ఫిజీషియన్‌ను సంప్రదించాలని, వారి సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.ఆసుపత్రి ఎండీ డాక్టర్ కే చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను అందించడమే



తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కే శివ శంకర్ రెడ్డి, డాక్టర్ కె అరవింద తదితరులు పాల్గొన్నారు.

# బేతంచర్ల మండలంలోని సర్పంచుల అందరికీ ఘనంగా సన్మానం

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు





**బేతంచర్ల ప్రతినిధి, ఏప్రిల్ 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండలంలోని అందరి సర్పంచుల పదవీకాలం అనగా ఈనెల.02/04/2026న ముగిసినది కావున , వారి యొక్క పదవీ కాలాన్ని సర్పంచులందరు దిగ్విజయంగా పూర్తి పూర్తిచేసినందుకు గాను, సర్పంచులందరికి తేదీ. 04/04/2026 శనివారం నాడు మండల ప్రజా పరిషత్తు కార్యాలయము బేతంచర్ల నందు మండలంలోని సర్పంచుల అందరికీ సన్మానం చేయడం జరిగినది ఇందులో భాగంగా అధ్యక్షులు, మండల ప్రజా పరిషత్తు, బేతంచర్ల వారు మరియు మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి, మరియు డిప్యూటీ ఎంపీడీవో, ఘాశీ,పంచాయతీ అభివృద్ధి అధికారులు అందరూ కూడా పాల్గొని కార్యక్రమమును విజయవంతం చేయడం జరిగినది

# కర్నూలు జిల్లా గోల్ షాట్ బాల్ అసోసియేషన్‌కు బోయా నరేష్ కుమార్ కార్యదర్శిగా నియామకం




**ఓర్వకల్లు ప్రతినిధి ఏప్రిల్ 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామ వాసి బోయా నరేష్ కుమార్‌ను ఆంధ్ర ప్రదేశ్ గోల్ షాట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శిగా నియమించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నోట్ల రాజేంద్ర ప్రసాద్, జనరల్ సెక్రటరీ దేవిప్రియ 17-03-2026న ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఆయనను రాయలసీమ జోన్ ఇంచార్జిగా కూడా నియమించారు. నరేష్ కుమార్ తన అనుభవంతో కర్నూలు జిల్లాలో గోల్ షాట్ బాల్ క్రీడను అభివృద్ధి పరచాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు

# గౌరు జనార్ధన్ రెడ్డి, సనాతని ల వివాహా రిసెప్షన్ లో పాల్గొన్న కర్నూలు ఎంపీ



**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**నూతనంగా వివాహం చేసుకున్న పాణ్యం ఎం.ఎల్.ఏ గౌరు చరితా రెడ్డి వెంకట రెడ్డి దంపతుల కుమారుడు జనార్ధన్ రెడ్డి , అనపర్తి ఎం.ఎల్.ఏ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల కుమార్తె సనాతనిలకు ఎంపీ బస్తిపాటి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.. పార్లమెంట్ సమావేశాలలో భాగంగా ఈ నెల రెండవ తేదీన జరిగిన వివాహానికి హాజరు కాలేకపోయిన ఆయన.. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ని ఎం.ఎల్.ఏ గౌరు చరితా నివాసంలో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధువారులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు

# టి.టి.డి చైర్మన్ బి.ఆర్ నాయుడును తొలగించాలి

## : ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్

**వివాదాలు దేవస్థానం ప్రతిష్టకు మచ్చ భక్తుల విశ్వాసం కాపాడాలని పిలుపు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 4)**తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి) చైర్మన్ బి.ఆర్ నాయుడును తక్షణమే పదవి నుండి తొలగించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బి.ఆర్ నాయుడు వ్యవహార శైలి మరియు ఇటీవల వెలుగులోకి వచ్చిన వివాదాలు దేవస్థానం ప్రతిష్టకు మచ్చ తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వంటి పవిత్ర సంస్థలో ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే ముఖ్యమని, అలాంటి సమయంలో వివాదాలకు కారణమవుతున్న వ్యక్తులు ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బి.ఆర్ నాయుడిని పదవి నుండి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్టేట్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఎంబిబిఎస్ ఫైనల్ పరీక్షలపై వైస్ ఛాన్సలర్ ఆకస్మిక తనిఖీ

## రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో కఠిన పర్యవేక్షణ మాల్ ప్రాక్టీస్‌కు కఠిన చర్యలు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 4)**
రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ విద్యలో పారదర్శకత, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కీలక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ పార్ట్-2 పరీక్షలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని నేరుగా సందర్శించిన ఆయన, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు సంతృప్తికరంగా జరుగుతున్నాయని పేర్కొంటూనే మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో జరుగుతున్న ఫైనల్ పరీక్షలను యూనివర్సిటీ ప్రత్యేక బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విజయవాడలోని ఒక మెడికల్ కాలేజీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తనిఖీ నిర్వహించగా, త్వరలో రిజిస్ట్రార్ కూడా పర్యటనలు చేపట్టనున్నారని చెప్పారు.
పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వబోమని హెచ్చరించిన ఆయన, నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులను రెండు సంవత్సరాల వరకు డీబార్ చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకూడదని సూచించారు.
అలాగే, యూనివర్సిటీ పరిధిలోని అన్ని పరీక్షలను లైవ్ వెబ్‌కాస్ట్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని, వైద్య విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. విద్యార్థులను అకాడమిక్, రీసెర్చ్, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ పరీక్షల ఏర్పాట్లను వివరించారు. 90 శాతం పూర్తయిన లెక్చరర్ గ్యాలరీ పనుల గురించి వివరించగా, మిగిలిన ఎలక్ట్రిఫికేషన్, సౌండ్ సిస్టమ్ పనులను త్వరలో పూర్తి చేయాలని వైస్ ఛాన్సలర్ సూచించారు.
పెండింగ్ పనులపై త్వరలో నిర్ణయాలు తీసుకుంటామని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింధియా శుభప్రద, యూనివర్సిటీ స్పెషల్ అబ్జర్వర్ ప్రొఫెసర్ రంగయ్య, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజేష్, పరీక్ష నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేపు యాడికిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

**సీఎం పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి**

**ఎలాంటి లోటుపాట్లు ఉండరాదు**

**ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్**

**పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం(యాడికి), ఏప్రిల్ 04,( రిపబ్లిక్ న్యూస్ ):**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం అనంతపురం జిల్లా, తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో.. సీఎం పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా యాడికి మండల కేంద్రం వద్దనున్న మార్కెట్ యార్డులో, హెలిప్యాడ్ వద్ద, సీఎం జలహారతి నిర్వహించే పెండేకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద ఏర్పాట్లను ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితరులు పరిశీలించారు.

**ప్రజావేదిక వద్ద స్టేజి ఏర్పాట్లు బాగా చేయించాలి**
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ సీఎం పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని ఆదేశించారు. ముందుగా హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు సిద్ధం చేయాలని, బ్యారికేడ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసే ప్రజావేదిక వద్ద స్టేజి ఏర్పాట్లు బాగా చేయించాలని, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. యాడికి మండల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజావేదిక వద్ద హై స్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ఏర్పాట్లు ఇబ్బంది లేకుండా చేపట్టాలని, మినిట్ టు మినిట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పెండేకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిర్వహించే జలహారతి కార్యక్రమానికి జాగ్రత్తగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ – ఆర్వైఎస్ఎస్ (రైతుకు సాధికార సంస్థ) వారి పిడిఎంఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) జీరో బేస్ న్యాచురల్ ఫార్మింగ్, డ్వామా పరిధిలో ఎన్ఆర్ఈజిఏ, ఏపీఎంఐపి కింద డ్రిప్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. సీఎం పర్యటన కోసం వేగవంతంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ప్రజావేదిక, సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సీఎం పర్యటన నేపథ్యంలో ప్రజావేదిక, సభాస్థలి, జల హారతి వద్ద ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలు వసంతబాబు, ఆర్బిఎస్కె శ్రీనివాస్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ చౌదరి, ఏఆర్ ఎస్పి ఇలియాజ్ భాష, ట్రైని ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, ఎస్డీసి రామ్మోహన్, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్.అండ్.బి ఈఈ రాజగోపాల్, డిఎల్డివో విజయలక్ష్మి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిపిఓ, జడ్పి సిఈఓ నాగరాజు నాయుడు, చేనేత జోలి శాఖ ఏడి వరప్రసాద్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ సురేష్, సిఐలు శివగంగాధర్ రెడ్డి, రామసుబ్బయ్య, శ్రీనివాస్, ఎస్డిసిఐలు క్రాంతి, ధరణి, ఎన్ఐసి డిఐఓ భారతి, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేపు రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన

**అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం జేఎన్టీయూ,ఏప్రిల్ 04,( రిపబ్లిక్ న్యూస్ ):**
రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలో అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జేఎన్టీయూలో నిర్వహించే స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి రానున్న నేపథ్యంలో శనివారం జేఎన్టీయూలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితరులు పరిశీలించారు.


**నిర్మాణాల భద్రతను ఆర్.అండ్.బి అధికారులు తనిఖీ**
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ పర్యటన నేపథ్యంలో అతిథి గృహం వద్ద, ఆడిటోరియంలో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్టేజి ఏర్పాట్లను జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. నిర్మాణాల భద్రతను ఆర్.అండ్.బి అధికారులు తనిఖీ చేయాలన్నారు. గోల్డ్ మెడలిస్టులు, విద్యార్థులకు పాసులను మంజూరు చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు, ట్రైని ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, ఆర్డీవో కేశవ నాయుడు, మహబూబ్ భాషా, శ్రీనివాసరావు, జేఎన్టీయూ రిజిస్టర్ కృష్ణయ్య, ఓఎస్డి దేవన్న, పిఆర్వో ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# మనస్థాపనతో వ్యక్తి ఆత్మహత్య

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):-** మండల కేంద్రం బండి ఆత్మకూరులో మారాసు బాలయ్య (34) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాలయ్య తీవ్ర మనస్థాపానికి గురై గత రెండు రోజుల క్రితం బండి ఆత్మకూరులోని ఆశ్రమంలో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసుత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. బాలయ్య మూర్చ వ్యాధితో బాధపడుతుండేవాడన్నారు. సుమారు ఒక ఏడాది క్రితం నిద్రలో మూర్ఛ రావడం వల్ల మంచం మీద నుండి కింద పడి రెండు భుజాలు విరిగాయన్నారు. వీటికి సంబంధించి శస్త్ర చికిత్స చేయించినప్పటికీ భుజం నొప్పి తగ్గలేదని మనస్థాపనతో జీవితం పై విరక్తి చెంది ఈనెల రెండో తారీఖున పురుగుల మందు తాగినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆయన కోలుకోలేక మృతి చెందినట్లు వివరాలు వెల్లడించారు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# బెల్డోన గ్రామంలో ఘనంగా భీమ లింగేశ్వర స్వామి రథోత్సవం







**చిప్పగిరి ఏప్రిల్, 4, (రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం బెల్డోన గ్రామంలో ఘనంగా భీమ లింగేశ్వర స్వామి రథోత్సవం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది, రథోత్సవం బెల్డోన రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్, భీమ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు, స్థానికులు, కళాకారుల చే కోలాటలు, బొమ్మలాట భక్తులను అలరించాయి, భీమ లింగేశ్వర స్వామి రథోత్సవం భక్త శ్రద్ధలతో ఊరేగింపు చేశారు, రథోత్సవ కార్యక్రమాన్ని సిఐ రవిశంకర్ ,చిప్పగిరి ఎస్ఐ సివి నరసింహులు ,బందోబస్తు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కోనంకి శ్రీనివాసులు, కరివేముల గోవిందు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, బంటనహాల్ సురేష్ , చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు,రామదుర్గం సోము నాయుడు, రామచంద్ర , కొలిమి సీనా, మీసాల రామాంజనేయులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలకు సన్నాహాలు

**గ్రామాల్లో ఆరోగ్య సదస్సులు, మెడికల్ క్యాంపులు నిర్వహించాలి- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 4)**జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శనివారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్‌తో కలిసి ప్రజల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించే చర్యలపై చర్చించారు. ఏప్రిల్ 7న నిర్వహించనున్న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని విలేజ్ అర్బన్ సెంటర్లలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్రధాన సమస్యలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై చైతన్యం కల్పించాలని కోరారు. అలాగే వైద్య సదుపాయాలు అందుబాటులో లేని గ్రామాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్‌తో పాటు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధిలో వ్యవసాయ విద్యార్థుల పాత్ర కీలకం











**మహానంది, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్)**
వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ ప్రాంత రైతుల అభివృద్ధికి కృషి చేయాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.జయలక్ష్మి అన్నారు. మహానంది మండలం గోపవరం గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు వైద్య శిబిరం వద్దకు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్న అనంతరం అవసరమైన మందులు పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయానికి పల్లెలు పట్టుకొమ్మలు అని విద్యార్థులకు వివరిస్తూ గ్రామస్థులకు అందించాల్సిన సేవా కార్యక్రమాలపై వివరించారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయ విద్యార్థులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోపవరం సర్పంచ్ వి. సుదర్శనం, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కటకటాల పాలైన కేటుగాడు

**తహసిల్దార్ ను బెదిరించి**

**రూ.50 లక్షలు వసూలు చేసిన నకిలీ ఏసీబీ**

**నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**



**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 04, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా:**
ఏసీబీ అధికారిగా నటిస్తూ తాసిల్దార్‌ను బెదిరించి రూ.50 లక్షలు వసూలు చేసిన నిందితుడిని ముదిగుబ్బ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మరుగుప్ప సిఐ శివరాముడు కేసు చేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు 2021 సంవత్సరంలో తనను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారిగా ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. ముదిగుబ్బలో తాసిల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి, అవినీతి కేసులు పెడతానని బెదిరించాడు. కేసుల నుంచి తప్పించుకోవాలంటే డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేసి మొత్తం రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదు అయినప్పటికీ నిందితుడు పరారీలో ఉండి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును సవాలుగా తీసుకున్న సీఐ శివరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను గమనించారు. చివరకు శనివారం నిందితుడు ఎరుకల హనుమంతును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కేసును ఛేదించిన సీఐ శివరాముడు వారి బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# పోలీసులే ప్రత్యక్ష సాక్షులుగా దళిత మహిళపై దారుణ దాడి

**తాతంశెట్టి నాగేంద్ర అనే రౌడీని వెంటనే అరెస్టు చేయాలి, -కాంగ్రెస్ వామపక్షాల డిమాండ్.**





**ఓబులవారిపల్లి ఏప్రిల్ 4 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గంలో టోల్గేటు గాంధీ విగ్రహం వద్ద సభ్య సమాజం తలదించుకునేలా హర్ష వీణ అనే దళిత మహిళ ఉద్యోగి పైన జనసేనకు సంబంధించిన తాతంశెట్టి నాగేంద్ర అతని అనుచరులు పోలీసులే ప్రత్యక్ష సాక్షులుగా పోలీసుల లాటి లాక్కుని వారు చూస్తు వారి సమక్షంలోని దారుణంగా అన్యాయంగా దుర్మార్గులుగా దళితమహిళ పైన దాడి చేయడం, కుల దూషణకు దిగడం దుర్మార్గమైన చర్య దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య సిపిఐ జ్యోతి చిన్నయ్య సిపిఎం కామ్రేడ్లు తీవ్రంగా ఖండించారు పార్టీలకు అతీతంగా ఈ దమనకాండను అన్ని పార్టీల వారు ఖండించాలన్నారుమహిళా అని చూడకుండా నడిరోడ్డులో పట్టపగలు ఒక దళిత మహిళపై దాడి చేయడం కుల దురాహంకారమే కూటమి ప్రభుత్వం వస్తే మహిళల పైన ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు



కానీ, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్ మీ సొంత పార్టీ నాయకులు ఒక మహిళ పైన దాడి చేస్తే వాళ్ళపైన ఎందుకు చర్య తీసుకోలేదు కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న మహిళలకు రక్షణ కరువైంది జనసేన ఎమ్మెల్యే వ్యక్తిగత విషయాలు చట్టా పరంగా కోర్టులో చూసుకోవాలి తప్ప బహిరంగంగా మహిళ పైన దాడి చేయడం ఎంతవరకు సమంజసం స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల అవుతున్న నేటికీ మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు అర్ధరాత్రి మహిళా ఒంటరిగా తిరిగినప్పుడు నిజమైన స్వతంత్రం అని మహాత్మా గాంధీ అన్నారు కానీ కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ ఏమాత్రం లేదు దళితుల పైన దళిత మహిళలు పైన దాడులు జరుగుతూనే ఉన్నాయి ఈ చర్యను దళిత సంఘాలు అన్ని దళిత నాయకులు ఖండించాలిడిప్యూటీ సీఎం ప్రశ్నిస్తా అని పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ ఎందుకు మహిళల పైన జరుగుతున్న దాడులను ఎందుకు ఖండించడం లేదు
ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైల్వేకోడూరు కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పలువురు వామపక్ష నాయకులు, పుల్లంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిగమాల రమేష్, రైల్వే కోడూరు నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసల బాలమురలీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అవుకు లో ఎంఆర్పీకి మించి అమ్మకాలు

## దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన లీగల్ టీం





**అవుకు ఏప్రిల్ 4 (రిపబ్లిక్ న్యూస్)**

అవుకు మండలంలో కొన్ని షాపులు ఎంఆర్పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేయడంతో అధికారులు వెంటనే స్పందించారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్ సూచనల మేరకు, జిల్లా అధ్యక్షులు శ్రీ అభిరుచి మధు నాయకత్వంలో జనతా వారధి బృందం ఈ సమస్యను గంభీరంగా తీసుకుంది.

ఫిర్యాదును అనుసరించి జనతా వారధి బృందం లీగల్ మెటలర్జీ డిపార్ట్‌మెంట్ అధికారులకు వినతిపత్రం అందజేసింది. దీనిపై తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు మండలంలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని షాపులపై కేసులు నమోదు చేశారు

లీగల్ మెటలర్జీ డిపార్ట్‌మెంట్ సీఐ నాగరాజు స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయించే దుకాణదారులపై 20వేల నుండి 50 వేల వరకు జరిమానా విధిస్తూ కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇటువంటి అక్రమాలు పునరావృతమైతే లైసెన్సుల రద్దు చేసేటువంటి చర్యలు కూడా తీసుకుంటాంఅని హెచ్చరించారు లీగల్ టీం సిఐ నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో అవుకు మండల అధ్యక్షులు రవి కుమార్, జనరల్ సెక్రటరీ సతీష్ కుమార్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ హరికృష్ణ, కార్యకర్తలు హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

## భుజరంపేట గ్రామానికి సంబంధించిన వచ్చినటువంటి నిధుల గురించి ఆర్టిఐ ద్వారా కోరడం జరిగింది



**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఈ రోజు అనగా 04/04/2026 నాడు బుజరంపేట గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధులు, ఖర్చులు, బిల్లుల చెల్లింపుల వివరాలు మరియు ఉపాధి హామీ పథకం స్కీమ్ ఫండ్స్ మరియు డెవలప్ మెంట్ వర్క్ CC రోడ్స్, డ్రైనేజ్, పల్లె ప్రకృతి వనాలు, ఫారెస్ట్ వాటర్ ట్యాంక్స్, బిల్లుల వివరాల గురించి ఎజూనశీ కార్యాలయం నందు గల(పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) గారికి RTI ( రైట్ టు ఇన్ఫర్మేషన్) యాక్ట్- 2005, 6( i )( i i) కింద వినమ్రంగా కోరడం జరిగింది

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

## కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు

## బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు

**వరంగల్ ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు-66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# ఒంటిమిట్టలో నేత్రపర్వంగా చక్రస్నానం



**ఒంటిమిట్ట ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11.15 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

## ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు


**హైదరాబాద్ ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ

ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజున 'పెయిడ్ హాలిడే' ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటు వేయడానికి వెళ్లే ఉద్యోగుల జీతంలో ఎటువంటి కోత విధించకూడదని యాజమాన్యాలకు సూచనలు జారీ అయ్యాయి. అసోం, కేరళ మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఓటర్ల కోసం ఏప్రిల్ 9వ తేదీన సెలవు ప్రకటించారు. తమిళనాడు ఓటర్ల కోసం ఏప్రిల్ 23వ తేదీన ప్రత్యేక సెలవు వర్తించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున, అక్కడి ఓటర్ల కోసం ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీల్లో సెలవులను కేటాయించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి ఓటు వేయడానికి తగిన సమయం కల్పించడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తించి, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

# చీకటిపై వెలుగుజయం


# ఈస్టర్ పండుగ ప్రత్యేకం



ప్రపంచ క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవనంలో అత్యంత ప్రాముఖ్యమైన పండుగగా ఈస్టర్ నిలుస్తోంది. యేసుక్రీస్తు సిలువపై మరణించిన మూడవ రోజున పునరుత్థానం పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ, ఆశ, విశ్వాసం, పునర్జన్మకు ప్రతీకగా భావించబడుతుంది. మానవాళికి ప్రేమ, క్షమ, త్యాగం వంటి విలువలను బోధించిన యేసుక్రీస్తు జీవితం ఈస్టర్ సందేశానికి పునాది.

ఈస్టర్‌కు ముందు వచ్చే గుడ్ ఫ్రైడే రోజున యేసుక్రీస్తు సిలువపై మరణించిన ఘట్టాన్ని స్మరించుకుంటారు. ఆ రోజు భక్తులు ఉపవాసాలు పాటిస్తూ, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, సిలువ మార్గ యాత్రల్లో పాల్గొంటారు. యేసు అనుభవించిన వేదనలను గుర్తుచేసుకుంటూ ఆత్మపరిశీలనకు సమయం కేటాయిస్తారు. అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ పండుగగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

జిల్లా కేంద్రాల నుంచి గ్రామాల వరకు చర్చిలన్నీ ఈస్టర్ వేడుకలతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజామునే ప్రార్థనలతో ప్రారంభమైన వేడుకలు భక్తి పరవశాన్ని కలిగిస్తున్నాయి. గీతాలాపనలు, బైబిల్ వచనాల పఠనం, ప్రత్యేక ప్రార్థనలు భక్తులను ఆధ్యాత్మికంగా ఉల్లాసపరుస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ప్రత్యేక విందులు ఏర్పాటు చేసుకుని పండుగను సంతోషంగా జరుపుకుంటున్నారు. ఈస్టర్ పండుగలో భాగంగా పిల్లలు రంగురంగుల ఆడుకోవడం, అలంకరణలు చేయడం వంటి సంప్రదాయాలు కూడా కనిపిస్తున్నాయి. ఈస్టర్ కొత్త జీవనానికి ప్రతీకగా భావించబడుతుంది. కొన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సహాయం చేయడం ద్వారా యేసు బోధించిన



ప్రేమ, సేవా భావాన్ని ఆచరణలో చూపిస్తున్నారు. ఈస్టర్ సందేశం మానవ సమాజానికి ఎంతో ప్రాధాన్యత కలిగింది. ద్వేషం, అసూయలను విడిచిపెట్టి ప్రేమతో జీవించాలని, క్షమాగుణాన్ని అలవరచుకోవాలని ఈ పండుగ సూచిస్తుంది. విభేదాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సందేశం మరింత అవసరంగా మారింది. వ్యక్తిగతంగా కూడా మనలోని చెడు అలవాట్లను వదిలి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఈస్టర్ ప్రేరేపిస్తుంది.మొత్తంగా ఈస్టర్ పండుగ చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. నిరాశలో ఉన్నవారికి ఆశను నింపుతూ, జీవితంలో కొత్త ఆరంభానికి దారితీస్తోంది. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం వంటి విలువలను బలపరుస్తూ సమాజాన్ని ఒకటిగా కట్టిపడేసే మహత్తర పండుగగా ఈస్టర్ నిలుస్తోంది.

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

## ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది -తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం

**చెన్నై ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :**

2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాలవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు



భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు.÷-రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

# 10న విడుదలవుతున్న డెకాయిట్

## ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం




అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

-------------

# రాముడు, పరశురాముడు.. రెండూ రణ్‌బీర్ కపూరే

**ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్**

ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశురాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది. రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించేందుకే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని రణ్‌బీర్ తెలిపాడు.



------------

# అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక. ఇండియా స్వీట్ హార్ట్ గా రష్మిక.. పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న "క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఆది సాయికుమార్ కొత్త చిత్రం... 'సైరాభాను'




యంగ్ హీరో ఆది సాయికుమార్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది.

ఇటీవలే 'కె-ర్యాంప్' చిత్రంతో సంచలన విజయం అందుకున్న ప్రముఖ నిర్మాత రాజేష్ దండా తన హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆది సాయికుమార్ సరసన బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. గులాబీ రంగు మేఘం, దాని కింద 'ప్రేమ, విశ్వాసం, విధికి సంబంధించిన ఒక సరదా ప్రయాణం' అనే ట్యాగ్‌లైన్‌తో రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఇది ఒక హిందూ-ముస్లిం ప్రేమకథ అని, వినోదభరితంగా సాగుతుందని తెలుస్తోంది. రాజమండ్రి, హైదరాబాద్ నగరాల నేపథ్యంలో కథ నడుస్తుంది. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిరణ్ అబ్బవరం, రామ్ అబ్బరాజు, కోన వెంకట్ తదితరులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'శంబాల'తో కెరీర్‌లో మంచి హిట్ అందుకున్న ఆది సాయికుమార్, ప్రస్తుతం కథాబలం ఉన్న కమర్షియల్ చిత్రాలను ఎంచుకుంటున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# డైరెక్టర్లకు రైటర్లకు పని పెట్టిన యాంగ్రీ యంగ్ మెన్!



: ఓడలు బల్లవుతాయి..బల్లు ఓడలవుతాయి అంటారు పెద్దలు. ఇది జీవితంలో సహజం. ఎప్పుడు ఎవరి స్థార్ తిరుగుతుందో..ఎవరి స్థానం ప్రధాన స్థాయికి చేరుకుంటుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. కాలాన్ని బట్టి మార్పులు వస్తుంటాయి. వాటిని అంతే హుందాతో స్వీకరించిన వారు విజయవంతంగా కెరీర్‌లో దూసుకుపోతూ ముందుకు సాగుతుంటారు. ఆ మార్పులు స్వీకరించని వారు అక్కడే ఉండిపోతారు. కాల క్రమేణా తెరమరుగవుతుంటారు. ఇదే విషయాన్ని బాగా ఒంటబట్టించుకున్నట్టున్నాడు యాంగ్రీ యంగ్ మెన్‌గా పేరు తెచ్చుకున్న డా. రాజశేఖర్.యాంగ్రీ యంగ్‌మెన్ డాక్టర్ రాజశేఖర్..ఒక దశలో పవర్ ఫుల్ కాప్ స్టోరీస్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో. అంకుశం, ఆహుతి, ఆవేశం వంటి పవర్‌ఫుల్ స్టోరీస్‌తో ప్రేక్షకుల్లో పోలీస్ అంటే ఇలా ఉండాలని ఓ ట్రేడ్ మార్క్‌ని సెట చేసి హీరోగా ప్రత్యేకతను చాటుకున్న డా. రాజశేఖర్ ఆ తరువాత ఆ స్థాయిలో ఆకట్టుకోవడంతో తడబడ్డారు. ఏజ్ ఫ్యాక్టర్, మారిన పరిస్థితులు, ప్రేక్షకుల అభిరుచి కారణంగా ఆయన హీరోగా రేసులో వెనకబడ్డారు. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా గ్రహించిన ఆయన కొత్త తరహా పాత్రలతో సెండ్ ఇన్నింగ్స్‌ని స్టార్ట్ చేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు.

కానీ ఏదీ వర్కవుట్ కాలేదు. ఒకటి రెండు సినిమాలు అంగీకరించినా వారు రాజశేఖర్ వంటిప్రొటెన్షియల్ ఉన్న స్టార్‌ని ఉపయోగించుకోవడంతో, ఆయన క్యారెక్టర్‌ని పవర్ ఫుల్‌గా డిజైన్ చేయడంలో ఫెయిలయ్యారు. దాంతో రాజశేఖర్ సెకండ్ ఇన్నింగ్స్ ప్రశ్నార్థకంలో పడింది. కోవిడ్ కారణంగా ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొని చావు దాకా వెళ్లొచ్చిన ఆయనకు ఇప్పటికి సరైన సినిమా దొరికింది అదే -బైకర్-. శర్వానంద్ హీరోగా నటించిన బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో డా. రాజశేఖర్ ఆయన ఇమేజ్‌కి తగ్గ క్యారెక్టర్‌లో నటించి మెప్పించారు.

# రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు.

**బడ్జెట్ అవుట్‌రీచ్ 2026-27 కార్యక్రమం విజయవంతం.**

**బడ్జెట్‌పై ప్రజల్లో అవగాహన పెంపే లక్ష్యం.**

**టెక్నాలజీతో బడ్జెట్ ప్రక్రియ సరళీకరణ.**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు కృషి.**

**ఆదాయ వనరుల పెంపుపై ప్రభుత్వ దృష్టి.**

**జిల్లాల స్థాయికి బడ్జెట్ సంస్కరణలు.**

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.**






**నంద్యాల ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** రాయలసీమ జిల్లాల్లో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం సుమారు రు. 40 వేల కోట్లను ఖర్చు చేయనున్నట్లు, ఇది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో శృంఖలాబద్ధమైన అభివృద్ధికి దారితీసే ఎకనామిక్ చైన్ రియాక్షన్‌గా మారుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన బడ్జెట్ అవుట్‌రీచ్ 202627 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామని, దానికి సుమారు రు.40 వేల కోట్లను ఖర్చు చేయనున్నామని తెలిపారు. ఇది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో శృంఖలాబద్ధమైన అభివృద్ధికి దారితీసే ఎకనామిక్ చైన్ రియాక్షన్‌గా మారుతుందని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం “బడ్జెట్ అవుట్‌రీచ్ 202627” కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బడ్జెట్ రూపకల్పన అనేది అన్ని శాఖల సమన్వయంతో జరిగే ప్రక్రియ అని పేర్కొంటూ, ప్రతిపాదనల దశలోనే స్పష్టమైన ప్రణాళికలను సమర్పించడం అత్యంత ముఖ్యమని సూచించారు. గతంలో బడ్జెట్ ప్రక్రియ క్లిష్టంగా ఉండేదని, ప్రస్తుతం సాంకేతికత సహాయంతో సరళీకరణ జరిగి, తక్కువ సమయంలోనే వివరాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. “బడ్జెట్ ఇన్ బ్రీఫ్”, “గైడ్ టు బడ్జెట్” వంటి పుస్తకాల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక సవాళ్లు ఎదురైనా, ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ వనరుల పెంపు ద్వారా పరిస్థితి మెరుగుపడుతోందన్నారు. ముఖ్యంగా కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్ వంటి శాఖల ద్వారా ఆదాయం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సేవారంగ అభివృద్ధి, ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా మల్టిప్లయర్ ఎఫెక్ట్ సృష్టించి రాష్ట్ర ఆర్థిక వృద్ధిని 11% నుంచి 15% వరకు పెంచడం లక్ష్యమని వెల్లడించారు. జిల్లా స్థాయిలో కూడా బడ్జెట్ సంస్కరణలు అమలు చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని అధికారులకు సూచించారు. బడ్జెట్‌లో పారదర్శకత పెంపు ద్వారా ప్రజలు ప్రభుత్వ పనితీరును సమీక్షించే స్థాయి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం - ఖర్చుల్లో అధిక భాగం జీతభత్యాలకే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారిందని... రాష్ట్ర రాబడిలో దాదాపు 99 శాతం వరకు జీతభత్యాలు, పెన్షన్లకే ఖర్చవుతున్న పరిస్థితి నెలకొందని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి నెల వరకు ఈ వ్యయం సుమారు 88 శాతంగా ఉండగా, మార్చి నెల లెక్కలు కలిపితే అది 99 శాతానికి చేరినట్లు తెలిపారు. గతంలో 2019-20 మరియు 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో ఈ వ్యయం వరుసగా 100 శాతం, 110 శాతానికి పెరిగినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు 21 శాతంగా ఉన్న హెచ్ఆర్ ఖర్చులు ఇప్పుడు భారీగా పెరిగిపోవడం ఆర్థిక వ్యవస్థపై భారంగా మారిందన్నారు. జీతాలు, పెన్షన్లతో పాటు ఆసుపత్రులు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం వంటి కీలక రంగాలకు నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ఉండటంతో ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందన్నారు. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్ర పరిస్థితి మరింత దిగువన ఉండగా, పొరుగు తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యయం కేవలం 47 శాతంగా ఉందని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో భాగంగా గత మార్చి 31న రూ.6,000 కోట్లు, ఈ ఏడాది మార్చిలో రూ.7,000 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

### పెన్షన్లకు తొలి ప్రాధాన్యం - జీతాల కంటే ముందుగా చెల్లింపు యోచన

ప్రభుత్వ ప్రాధాన్యతల్లో రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు మొదటి స్థానం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇకపై ముందుగా పెన్షన్లు చెల్లించి, ఆ తర్వాతే జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు.

### మున్సిపాలిటీల్లో సంస్కరణలు - నిర్ణయాల్లో వేగం

మున్సిపల్ పాలనలో కీలక సంస్కరణలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో మున్సిపాలిటీ నిధుల విడుదల ఆర్థిక శాఖ ద్వారా జరిగేదని, దీనివల్ల ఆలస్యం చోటుచేసుకునేదని తెలిపారు. ప్రస్తుతం ఆ బాధ్యతలను నేరుగా మున్సిపల్ శాఖకు అప్పగించి, కమిషనర్లు మరియు చైర్మన్లకు పూర్తి అధికారాలు కల్పించినట్లు వెల్లడించారు. ఈ సంస్కరణను గత ఏడాది ఏప్రిల్ 1 నుండి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

### డీఎంఎఫ్ నిధుల వినియోగం - జిల్లాలకు స్వయం నిర్ణయాధికారం

జిల్లా కలెక్టర్ల వద్ద ఉండే డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధులు గత ఐదేళ్లలో పూర్తిగా వినియోగించబడటంతో ప్రస్తుతం బ్యాలెన్స్ సున్నాగా మారినట్లు తెలిపారు. ఇకపై ఈ నిధులను జిల్లాల్లోనే ఉంచి, కలెక్టర్లకు గ్రీన్ ఛానల్ ద్వారా స్వతంత్రంగా వినియోగించే అధికారం ఇవ్వాలని నిర్ణయించారు.

### కేంద్ర పథకాల వినియోగంలో రాష్ట్ర కృషి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 93 పథకాలలో రాష్ట్రం చురుకుగా భాగస్వామ్యం అవుతూ, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో 14 పథకాలను అమలు చేస్తోంది. గతంలో నిలిచిపోయిన సుమారు 85 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, వాటి కోసం రూ.18,000 కోట్లను వినియోగించినట్లు తెలిపారు. కేంద్ర నిధులను సమర్థవంతంగా పొందేందుకు అన్ని శాఖలతో సమన్వయం కొనసాగుతోందని పేర్కొన్నారు.

### మౌలిక సదుపాయాల అభివృద్ధి - భారీ ప్రణాళికలు

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు నీటిపారుదల రంగానికి అధిక నిధులు కేటాయించగా, సుమారు 10,000 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ.3,000 కోట్లను కేటాయించారు. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ మోడల్ ద్వారా సేవలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### బడ్జెట్ వివరాలు - ఆదాయం, వ్యయం సమతుల్యం కష్టసాధ్యం

రాష్ట్ర ఆదాయం సుమారు రూ.2,34,000 కోట్లు కాగా, అప్పులతో కలిపి మొత్తం బడ్జెట్ రూ.3,32,000 కోట్లుగా ఉంది. రోజువారీ ఖర్చులకు సంబంధించిన రెవెన్యూ వ్యయం సుమారు రూ.2,56,000 కోట్లు కాగా, దీర్ఘకాల ప్రయోజనాల కోసం క్యాపిటల్ వ్యయం పెంపుపై దృష్టి సారించారు. ఈ ఏడాది రూ.50,000 కోట్ల మూలధన వ్యయం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

### పాత బకాయిల క్లియరెన్స్ - కీలక చర్యలు

గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న రూ.24,819 కోట్ల బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం క్లియర్ చేసినట్లు వెల్లడించారు. అదనంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు కనీసం రూ.2,000 కోట్ల మేర కొత్త వనరులు సృష్టించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు – భారీ కేటాయింపులు

రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించింది. ‘ఎన్టీఆర్ భరోసా’కు రూ.33,000 కోట్లు, ‘దీపం’ పథకానికి రూ.2,000 కోట్లు, ‘తల్లికి వందనం’కు సుమారు రూ.10,000 కోట్లు, ‘అన్నదాత సుఖీభవ’కు రూ.6,600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

### పాలనా సంస్కరణలు పారదర్శకతకు ప్రాధాన్యం

నిధుల కేటాయింపులో ఆలస్యాన్ని తగ్గించేందుకు ఆన్‌లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలకు నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయడంతో కలెక్టర్లకు స్పష్టత పెరుగుతుందని అన్నారు. పారదర్శకతను పెంచుతూ బలమైన వ్యవస్థలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

---

# భూగర్భజలాల పెంపుదలకు 100 రోజుల ప్రత్యేక డ్రైవ్.

**జలధార కార్యక్రమంతో నీటి భద్రతపై దృష్టి.**

**శాస్త్రీయ మ్యాపింగ్‌తో నీటి వనరుల గుర్తింపు.**

**జిల్లా నుంచి గ్రామ స్థాయికి కమిటీల ఏర్పాటు.**

**సాగునీటి సంఘాల ద్వారా నీటి నిర్వహణ బలోపేతం.**

**వేసవి పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణ చర్యలు.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**నంద్యాల ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** జిల్లాలో భూగర్భజలాల స్థాయిని పెంపొందించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన, శాస్త్రీయ మ్యాపింగ్, వర్షపు నీటి నిల్వ, కృత్రిమ రీఛార్జ్ చర్యలు మరియు ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర ప్రణాళికలను అమలు చేయడం అత్యవసరమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో భూగర్భజలాల పెంపుదలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో “జలధార” కార్యక్రమం మరియు “నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత” అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు 100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌గా కార్యక్రమాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హైడ్రోజియోలాజికల్ మ్యాపింగ్ ద్వారా భూగర్భ జలాశయాల స్థితిని అంచనా వేసి, సర్వే నంబర్ల వారీగా నీటి వనరులు, వాగులు, వంకలను ఖచ్చితంగా గుర్తించాలన్నారు. పనుల పురోగతిని ప్రతిరోజూ, ప్రతి వారం ఫోటోలతో సహా నివేదించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేసి ఉత్తర్వులు జారీ చేయాలని వాటర్ రిసోర్సెస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 261 సాగునీటి సంఘాలు ఉన్నాయని, వాటి ద్వారా నీటి వినియోగం, నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. డోన్ నియోజకవర్గం పూర్తిగా వర్షాధారిత ప్రాంతం కావడంతో, భూగర్భజలాల స్థాయి పెంపుకు సాంకేతికంగా అనుకూలమైన పనులు చేపట్టాలని చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కాలువల చివరి ప్రాంతం (టెయిల్ ఎండ్) కావడంతో, ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూగర్భజలాల పెంపుదల కోసం చెక్ డ్యామ్‌లు, చెక్ వాల్స్, పర్కోలేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్, డగౌట్ పాండ్స్, కాంటూర్ ట్రెంచెస్, రాక్ ఫిల్ డ్యామ్స్ వంటి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని తెలిపారు. ఈ పనులకు నాబార్డ్, ఏపిడబ్ల్యూడీ వంటి సంస్థల ద్వారా ఆర్థిక సహకారం పొందే అవకాశముందని పేర్కొన్నారు. సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏపీ వార్మ్స్ యాప్ ద్వారా గ్రామ నీటి భద్రతా ప్రణాళికలు, బడ్జెట్లు సిద్ధం చేయాలని సూచించారు. పనులన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి, ‘బిఫోర్’ మరియు ‘ఆఫ్టర్’ ఫోటోలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వాటర్ రిసోర్సెస్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ వంటి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మండల స్థాయిలో సాంకేతిక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలానికి బాధ్యతాయుత అధికారులను నియమించి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని చెప్పారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, పశువులకు నీరు మరియు పచ్చగడ్డి లభ్యత, నీటి కుంటల అభివృద్ధి వంటి అంశాలపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏప్రిల్ 16 నుండి 20 తేదీల మధ్య పనులకు సంబంధించిన అన్ని అనుమతులను పూర్తిచేసి, అనంతరం ఏప్రిల్ 21 నుండి జూలై 9 వరకు చేపట్టిన పనులన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ, జల్ శక్తి అభియాన్, ఉపాధి హామీ పథకం వంటి పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అన్ని శాఖల సమిష్టి కృషితో భూగర్భజలాల పెంపుదల సాధ్యమవుతుందని, దీని ద్వారా రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ తెలిపారు

---

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోండి.

**గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను ముందుగానే పరిష్కరించాలి.**

**జిల్లా ఇంచార్జి మంత్రి / రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.**




**నంద్యాల ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన బడ్జెట్ అవుట్‌రీచ్ 202627 కార్యక్రమం అనంతరం, వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా ఆర్డబ్ల్యూఎస్ మరియు పబ్లిక్ హెల్త్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న బోర్‌వెల్స్‌కు తప్పనిసరిగా జియో-మ్యాపింగ్ చేయాలని, అలాగే మరమ్మతు చేయగలిగేవి, చేయలేనివి ఎంతమేర ఉన్నాయో వివరాలు సేకరించాలని సూచించారు. ఆర్డబ్ల్యూఎస్ జూనియర్ ఇంజనీర్లు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమాచార మాధ్యమాల్లో వెలువడే త్రాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి, జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే అవసరాన్ని బట్టి డీఎంఎఫ్ నిధులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సూచించారు.

---

# ఉచిత విద్యుత్తు పై ప్రభుత్వానికి చేనేతలు కృతజ్ఞతలు

**నంద్యాల ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు ఉచితంగా ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భీమనపల్లె వెంకట సుబ్బయ్య ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో 93 వేల చేనేత కుటుంబాలకు, 11488 మరమగ్గాల యూనిట్ల వెరసి 1,04,488 మంది నేతన్నలకు ఈ ఉచిత విద్యుత్తు పథకం అమలవుతుందన్నారు ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 150 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. ఇప్పటికే చేనేత పెన్షన్ల ద్వారా రాష్ట్రంలో 92,724 మంది మందికి ప్రతినెల 4000 రూపాయలు లబ్ధి చేపడుతుందని గుర్తు చేశారు.

త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్ కింద ప్రభుత్వ వాటా 8శాతం నుంచి 16% పెంచడం జరిగిందని, ఇందు కొరకు 5 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా 38 కోట్ల 31 లక్షలతో ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయబోతున్న సందర్భంగా హర్ష వ్యక్తం చేసారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద రాష్ట్రానికి 10 అవార్డులు వస్తే అందులో 4 అవార్డులు చేనేత రంగానికి దక్కటం కూటమి ప్రభుత్వ పనితనానికి నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా



తెలియజేస్తూ మరోసారి కూటమి ప్రభుత్వానికి చేనేత వర్గం తరఫున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.


రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, ఐటీ శాఖ మాత్యులు మంత్రి నారా లోకేష్ బాబు కి, చేనేత మంత్రి సవితమ్మ కి ఈ సందర్భంగా ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలియ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు శ్రీ చెన్నా వెంకటేశ్వర్లు గారు పుత్త రామకృష్ణ గారు గాజుల శంకర్ గారు ప్రధాన కార్యదర్శి ఉద్దంటి వెంకట సతీష్ గారు కార్యదర్శి గుద్దేటి వెంకటరామయ్య గారు గాజుల బ్రహ్మయ్య చేపూరి మురళి చింతలపల్లె వాసు సాదు సూర్యనారాయణ మద్దాల మోహన్ సింగరి సురేష్ మరియు మహిళ సభ్యులు జింక రాజేశ్వరి కోటా నాగరత్నమ్మ శోభారాణి మరియుకుల బాంధవులు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

---

# ఏప్రిల్ 6వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం.

**అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.**

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు , ఏప్రిల్ 4( రిపబ్లిక్ న్యూస్) :** ఈ నెల 6వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు **Meekosam.ap.gov.in**(మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com